## క్లుప్తంగా

### ఫిబ్రవరి 17న సామూహిక ఉపనయనాలు

విజయవాడకల్చరల్: అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 17వ తేదీ సోమవారం గాంధీనగర్‌లోని కొత్తాపూర్ణానందం కళావేదికపై బ్రాహ్మణ బాలురకు సామూహిక ఉపనయన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు తాళ్లూరి వెంకట దశరథ రమేష్ తెలిపారు. గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. అధ్యక్షుడు డాక్టర్ బీవీ గురునాథ శర్మ మాట్లాడుతూ.. సంస్థ ద్వారా ప్రతీ ఏటా వివాహ పరిచయ వేదిక, సామూహిక మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేర్లు ముందుగా నమోదు చేసుకోవడానికి 99660 96999, 97049 98486 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### భవన నిర్మాణ వ్యర్థాల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడ సెంట్రల్): ఎట్టకేలకు నగరపాలకసంస్థ అధికారులు స్పందించారు. జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీలో బుడమేరు పక్కన వేసిన భవన నిర్మాణ వ్యర్థాలను జేసీబీతో తొలగించారు. ఇక్కడ రోడ్డు పక్కన ఇష్టారాజ్యంగా భవన నిర్మాణ వ్యర్థాలు వేయటంతో స్థానికులు పడుతున్న అవస్థలు వివరిస్తూ సాక్షి దినపత్రికలో బుధవారం 'ఆదమరిస్తే అంతే...' శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు రోడ్డు మార్జిన్‌లలో ఇబ్బందికరంగా మారిన భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించి రోడ్డు శుభ్రం చేశారు. అధికారులు స్పందించటం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

### స్వర మాంత్రికుడు కేజే జేసుదాసు




విజయవాడకల్చరల్: స్వర మాంత్రికుడు కేజే జేసుదాసు అని విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్ రాజు అన్నారు. చంద్రశేఖర్ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం సంగీత విద్వాంసుడు జేసుదాస్ జన్మదిన వేడుకలు, సినీ సంగీత విభావరి నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డేవిడ్ రాజు మాట్లాడుతూ.. స్వయంకృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్న గాయకుడు జేసుదాసు అని అభివర్ణించారు. చంద్రశేఖర్ కల్చరల్ అకాడమీ వ్యవస్థాపకుడు దండు చంద్రశేఖర్ సంస్థ లక్ష్యాలను వివరించారు. తెలుగు కళా వాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ జేసుదాసు దాదాపు అన్ని భారతీయ భాషల్లో పాటలు పాడారన్నారు. సునీల్ కుమార్, భారతి ఆదిరాల జయప్రభ తదితరులు చిత్రగీతాలను ఆలపించారు. అతిథులు చంద్రశేఖర్‌ను ఆత్మీయంగా సత్కరించారు.

### 17న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని ప్రభుత్వ దంత వైద్య కళాశాల, ఆస్పత్రిలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న సీనియర్ రెసిడెంట్స్ (ఎస్‌ఆర్) నియామకాల కోసం ఈ నెల 17న వాక్ -ఇన్ -ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని శ్రీనివాసరావు తెలిపారు. ఆ రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు హాజరుకావాలని పేర్కొన్నారు.

### సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపిక



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి కె.నాని సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పురుషుల క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, వ్యాయామ విద్యా విభాగాధిపతి డాక్టర్ డీ యుగంధర్, అధ్యాపకులతో కలిసి నానిని అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ ఆధ్వర్యాన నిర్వహించబోయే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ టోర్నమెంట్‌కు తమ కళాశాల విద్యార్థి ఎంపిక కావటం ఆనందంగా ఉందన్నారు. టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రదర్శన చూపి కళాశాలకు, నగరానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కొల్లూరు రమేష్, డి.రాజ్యలక్ష్మి, కిషోర్, ఇస్మాయిల్, సిబ్బంది పాల్గొన్నారు.

# గోరా పార్క్‌ను అభివృద్ధి చేయరూ!

- దెబ్బతిన్న అరుగులు
- మాయమైన ఐరన్ మెష్
- కళావిహీనంగా ఏనుగు అంబారీ



పార్క్‌లో అధ్వానంగా ఉన్న అరుగు



పూర్తిగా దెబ్బతిన్న ఐరన్ మెష్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్‌నగర్ సాంబమూర్తి రోడ్డులోని గోరా పార్క్ అస్తవ్యస్తంగా తయారైంది. పార్క్‌కు ఓ వైపు ప్రధాన రహదారి, మరో వైపు రైవస్ కాలువ ఉంది. స్థానికులకు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని ఇచ్చేందుకు కాలువ గట్టున పార్క్ మున్సిపల్ కార్పొరేషన్ పార్క్‌ను నిర్మించింది. పార్క్ లోపల చెట్లకు ఏర్పాటు చేసిన అరుగులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దెబ్బతిన్న అరుగులకు మరమ్మతులు చేపట్టలేదు. కొన్ని అరుగుల మీద కట్టెలు పడేశారు. సాంబమూర్తి రోడ్డు కంటే పార్క్ నాలుగు అడుగుల దిగువన ఉంటుంది. రోడ్డు మార్జిన్‌పై నుంచి పార్క్‌లోకి దూకకుండా ఐరన్ మెష్ ఏర్పాటు చేశారు. ఎంట్రన్స్ వైపు పెద్ద గేటును ఏర్పాటు చేశారు.

**పార్క్‌లోకి వెళ్లాలంటేనే దడ..**

అయితే ప్రహరీకి ఏర్పాటు చేసిన ఐరన్ మెష్ పూర్తిగా మాయమైపోయింది. గతంలో గోడ పొడవునా ఎవరూ దూకకుండా మెష్ ఎత్తుగా ఏర్పాటు చేశారు. అందులో కొంత భాగం కూడా కనిపించడం లేదు. దీంతో గేటు వేసి ఉన్నా ప్రయోజనం లేదు. రోడ్డు పొడవునా ఎటువైపు నుంచైనా పార్క్‌లోకి ప్రవేశించే అవకాశం ఉంది. దీన్ని ఆసరాగా తీసుకుని ఆకతాయిలు పార్క్‌లోకి వెళ్లి మద్యం సేవిస్తున్నారు. పార్క్ వాతావరణాన్ని దెబ్బతీస్తున్నారు. దీనికి తోడు ప్రైవేటు బస్సులు రోడ్డు మార్జిన్‌లో పార్క్ చేస్తున్నారు. పార్క్‌కు రోడ్డుకు మధ్య ఫుట్‌పాత్ అన్‌లోడింగ్, లోడింగ్ చేస్తున్నారు. బస్సుల సిబ్బంది పార్క్‌లోనే అన్ని పనులు పూర్తి చేసుకుంటున్నారు. రాత్రి వేళల్లో ఈ ఫుట్‌పాత్‌పై మద్యం సేవించి బాటిల్స్ పార్క్‌లోకి, ఫుట్‌పాత్ పైన విసురుతున్నారు. ఆకతాయిలు చేస్తున్న ఆకృత్యాలకు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం కంటికి రెప్పలా కాపాడుతున్న ఏదో వైపు నుంచి పార్క్‌లోకి ప్రవేశించి మద్యం సేవిస్తున్నారు. కొందరు ఏకంగా పగటి పూటే మద్యం సేవిస్తున్నారు. పార్క్‌లోకి వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది.

**అంబారీకి రంగులేయాలి..**

పిల్లలు ఆడుకునేందుకు పార్క్ మధ్యలో ఏనుగు అంబారీని ఏర్పాటు చేశారు. కొన్నేళ్ల క్రితం నిర్మించింది కావడం దాని బాగోగులు పట్టించుకోకపోవడం రంగులు వెలిసిపోయి కళా విహీనంగా మారింది. కనీసం రంగులకు కూడా నోచుకోవడం లేదు. రోడ్ల పక్కన గోడలపై చిత్రాలు వేయిస్తున్న కార్పొరేషన్ పార్క్‌లో ఏర్పాటు చేసిన ఏనుగు అంబారీ కూడా రంగులు వేస్తే సెలవు రోజుల్లో పిల్లలు సరదాగా గడిపేందుకు వీలుంటుందని స్థానికులు కోరుతున్నారు.

**ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి**

పార్క్ ప్రహరీపై నుంచి దూకకుండా ఏర్పాటు చేసిన ఐరన్ మెష్ మిగిలిన కొంత భాగాన్ని పూర్తిగా తొలగించాలి. దాని స్థానంలో కొత్త మెష్ ఏర్పాటు చేయాల్సి ఉంది. అప్పుడే ఆకతాయిలు పార్క్‌లోకి ప్రవేశించకుండా అడ్డుకట్ట వేయొచ్చు. ప్రధాన రహదారి వెంబడి, ప్రధాన కూడలి ఉన్నప్పటికీ ఈ పార్క్ గురించి అధికారులు పట్టించుకోవడం లేదు. తక్షణమే ఐరన్ మెష్ ఏర్పాటు చేయాలని, చక్కటి చెట్ల మొదళ్లలోని అరుగులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.



పార్క్‌లో మద్యం సేవిస్తున్న మందుబాబులు

### కైలాసనాథునికి మల్లాది ప్రత్యేక పూజలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట చల్లపల్లి బంగ్లా సమీపంలోని అన్నపూర్ణ సమేత శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముక్కంటికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. కైలాసనాథుని చల్లని చూపు నియోజకవర్గ ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### దాసాంజనేయ దేవాలయంలో ధనుర్మాస పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం శ్రీదాసాంజనేయ స్వామివారి దేవాలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి పర్యవేక్షించారు.

# వైభవంగా కూడారై మహోత్సవం



ముత్యాలంపాడు బాబా మందిరంలో..



స్వామివారిని దర్శించుకుంటున్న గౌతంరెడ్డి



కోదండ రామాలయంలో పాయస నివేదన



రాధాకృష్ణ గీతా మందిరంలో

మధురానగర్(విజయవాడసెంట్రల్): ధనుర్మాసాన్ని పురస్కరించుకుని నగరంలోని వైష్ణవ దేవాలయాల్లో కూడారై మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. గోదాదేవి సర్వజనులు సుఖశాంతులతో వర్థిల్లాలంటూ స్వామివారికి 108 గంగాళాలతో పాయసం నివేదన చేశారు.

**ముత్యాలంపాడులో..**

ముత్యాలంపాడు శ్రీ షిర్డీసాయిబాబా మందిరంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన కూడారై పాయస నివేదన కార్యక్రమం జరిగింది. మద్దు శ్రీనివాసరావు, సుధావాణి దంపతులు పారాయణ మండలి కన్వీనర్ మందలపర్తి సత్య శ్రీహరి పర్యవేక్షణలో 1,008 లఘు గంగాళాలతో పాయస నివేదన చేశారు. కార్యక్రమంలో మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని భక్తులతో కలిసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ కలిసిమెలసి పండుగలు జరుపుకోవాలని అన్నారు. నెల రోజుల పాటు కనులపండువగా ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్న శ్రీ విష్ణుసహస్రనామ పారాయణ మండలి కన్వీనర్ మందలపర్తి సత్యశ్రీహరిని అభినందించారు. అనంతరం 3 వేల మందికి పాయసం పంపిణీ చేశారు. తొలుత శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం, బాబావారికి విశేషంగా పాలు, పంచామృతాలతో అభిషేకం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

**శ్రీ కోదండ రామాలయంలో..**

ముత్యాలంపాడు శ్రీ కోదండ రామాలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆలయకమిటీ ఆధ్వర్యాన శనివారం 1,008 లఘు గంగాళాలతో పాయస నివేదన జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొని శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం భక్తులకు స్వామివారికి నివేదన చేసిన పాయసాన్ని భక్తులకు పంపిణీ చేశారు.

**శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో.....**

అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన కూడారై పాయస నివేదన భక్తుల సమక్షంలో ఘనంగా జరిగింది. స్వామివారిని ప్రత్యేకంగా పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం స్వామివారికి తులసి, పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 108 గంగాళాలతో స్వామివారికి కూడారై పాయస నివేదన చేసి భక్తులకు పంచిపెట్టారు

**పట్టాభి రామచంద్రస్వామి దేవాలయంలో..**

స్థానిక ముత్యాలంపాడులోని శ్రీపట్టాభిరామచంద్రస్వామి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కూడారై ఘనంగా జరిగింది. ఏడడుగుల గోదాదేవి చిత్రాన్ని చూడముచ్చటగా వేశారు. ఈ చిత్రం చుట్టూ దీపాలను ఏర్పాటుచేసి 108 లఘు గంగాళాలతో పాయస నివేదన చేశారు. గోదాదేవి చిత్రం చూపరులను, భక్తులను ఆనంద పారవశ్యంలో ముంచెత్తింది.

**సింగ్‌నగర్ వ్యాప్తంగా..**

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ పీఅండ్‌టీ కాలనీలో ప్రసిద్ధిగాంచిన శ్రీ రాధాకృష్ణ గీతా మందిరంలో వైకుంఠ ఏకాదశి వేడుకల్లో భాగంగా శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారుజామున 5 గంటల నుంచి గోదాదేవి అమ్మవారికి 108 గంగాళాలతో పాయస నివేదన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కోలాట మహిళా బృందం ఆధ్వర్యంలో కోలాటాలు ఉత్సాహ భరితంగా జరిగాయి. విశేష సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారికి పూజలు చేశారు.

**రేపు గోదాదేవీ కల్యాణోత్సవం**

ఈ నెల 13వ తేదీన గోదాదేవి కల్యాణ మహోత్సవ వేడుకలను ఆలయ ప్రాంగాణంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త చుండూరు అన్నపూర్ణ తెలిపారు. గోదాదేవి కల్యాణ మహోత్సవంలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరుగుతాయన్నారు. భక్తులంతా ఈ వేడుకల్లో హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందుకోవాలని ఆమె కోరారు. ఆలయ కమిటీ పెద్దలు చుండూరు శ్రీనివాసరావు, నళిని తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాలలో విద్యార్థులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వాణీ స్కూల్‌లో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పాఠశాలను గ్రామీణ వాతావరణం, పచ్చని తోరణాలు, చెరకుగడలు, ముగ్గులు, గొబ్బెమ్మలతో అలకరించారు. తెలుగు సంస్కృతీ సంప్రదాయం ఉట్టిపడేలా భోగిమంటలు వేయడం, కోడిపందేలు, రైతులు వరికుప్పలు నూర్పి ధాన్యం ఎగరబోయడం, పాల పొంగలి చేయడం, చిన్నారులకు భోగి పండ్లు పోయడం, బొమ్మలకొలువు, గాలిపటాలు ఎగరవేయటం చేశారు. పాఠశాల డైరెక్టర్ అంజూరి శేషుబాబు, ప్రిన్సిపాల్ ఏ.ఝాన్సీలక్ష్మి సంక్రాంతి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. గంగిరెద్దుల విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు వాసవీక్లబ్ ఆధ్వర్యాన బహుమతి ప్రధానం చేశారు.

## హోరాహోరీగా బీఎన్‌కేయూ చెస్ రేటింగ్ టోర్నీ



చెస్ టోర్నీలో పాల్గొన్న క్రీడాకారులు



వెంకట కృష్ణకార్తీక్‌ను సన్మానిస్తున్న బీఎన్‌కేయూ ప్రతినిధులు

**ముందంజలో తెలంగాణ క్రీడాకారుడు సమరతేజ**

విజయవాడస్పోర్ట్స్: భారతీయ నవీన క్రీడా ఉత్సవ్(బీఎన్‌కేయూ) ఫౌండేషన్ రెండో అంతర్జాతీయ 1800 లోపు చెస్ ఫిడే రేటింగ్ టోర్నమెంట్ రెండో రోజు శనివారం ఉత్సాహభరితంగా సాగింది. ప్రపంచ చదరంగ సమాఖ్య, అఖిల భారత చదరంగ సమాఖ్య సౌజన్యంతో పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న ఈ పోటీల్లో 425 మంది క్రీడాకారులు తలపడుతున్నారు. రెండో రోజు పోటీలను ఐకాన్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కొండిశెట్టి రాజేంద్ర, ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ కార్యదర్శి సుమన్ ప్రారంభించారు. రెండో రోజు సాయంత్రానికి ఆరు రౌండ్లు పూర్తయ్యాయి. ఈ పోటీల్లో తెలంగాణ క్రీడాకారుడు సమరతేజ 6/6 పాయింట్ల ఆధిక్యంతో ముందంజలో కొనసాగుతున్నాడని టోర్నీ కన్వీనర్ షేక్ ఖాసీం, డైరెక్టర్ సలపల భీమారావు, బీఎన్‌కేయూ కార్యదర్శి విత్తనాల కుమార్, ఉపాధ్యక్షులు అమ్మిన ఉదయకుమార్‌నాయుడు, కోశాధికారి నరేష్ తెలిపారు. పోటీల్లో భాగంగా ఇటీవల కిరిస్తాన్‌లో జరిగిన ఏషియన్ డిజేబుల్డ్ ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్‌లో ప్రథమ బహుమతి సాధించి, ప్రపంచ డిజేబుల్డ్ ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించిన విజయవాడ క్రీడాకారుడు వెంకటకృష్ణకార్తీక్‌ను బీఎన్‌కేయూ ఫౌండేషన్ ప్రతినిధులు సన్మానించి, జ్ఞాపికను అందజేశారు.

# వడ్డే ఓబన్నకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న వీఎంసీ ఏసీ చంద్రశేఖర్, అధికారులు

పటమట(విజయవాడతూర్పు): భయం ఎరుగని వడ్డెర్లు, బోయలు చెంచులతో కూడిన సంచార తెగల సైన్యాన్ని, సమర్థవంతంగా నడిపించిన నాయకుడు వడ్డే ఓబన్న అని వీఎంసీ అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్ తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం వద్ద వడ్డే ఓబన్నకు శనివారం ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దట్టమైన నల్లమల అడవుల్లో సైతం, కుంఫనీ సైన్యాన్ని ఊచకోత కోసి ఉరుకులు పెట్టించడంలో ముఖ్య పాత్ర పోషించిన వీరుడు వడ్డే ఓబన్నని తెలిపారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అలాంటి మహనీయులని గుర్తు చేసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు. కార్యక్రమంలో అకౌంట్ ఆఫీసర్ సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

**ఘనంగా వడ్డే ఓబన్న జయంతి**

విజయవాడస్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. స్పోర్ట్స్ ఆఫీసర్‌లు కోటేశ్వరరావు, వంశీ, మహేష్, సురేంద్రబాబు, కిషోర్‌బాబు, కార్యాలయ అధికారులు, సిబ్బంది ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రేనాటి పాలెగాళ్లకు బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి తవర్జీ విషయంలో ప్రారంభమైన ఘర్షణలు ఓబన్నను సాయుధ పోరాటం వైపు నడిపించాయని చెప్పారు. అనంతరం స్వాతంత్ర్య కోసం బ్రిటీషర్స్‌తో ఎన్నో పోరాటాలు జరిపారని గుర్తు చేశారు.

## 25 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై కేసుల నమోదు

విజయవాడస్పోర్ట్స్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రయాణాలను సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై చర్యలు తీసుకుంటున్నామని జిల్లా డెప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్(డీటీసీ) ఎ.మోహన్ తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన, ప్రయాణికులను ఇబ్బందులను గురి చేస్తున్న బస్సులపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. దీని కోసం ప్రత్యేకంగా ఎనిమిది టీమ్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు. విజయవాడలోని కనకదుర్గా వారధి, ఇబ్రహీపట్నం వద్ద ప్రత్యేక టీమ్‌లు శనివారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించాయన్నారు. ఈ తనిఖీల్లో 25 బస్సులపై కేసులు నమోదు చేసి రూ.6 లక్షలు జరిమానా విధించినట్లు చెప్పారు. మరో మూడు బస్సులను సీజ్ చేశామన్నారు. ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేసినా, వారిని ఇబ్బందులకు గురి చేసిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నటరాజస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం



స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న అర్చకులు, అధికారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో శ్రీశివకామ సుందరీ సమేత నటరాజస్వామి వారి కల్యాణోత్సవాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. స్వామి వారి ఆలయంలో ఉత్సవ మూర్తులకు మంగళస్నానాలు, వధూవరులుగా అలంకరించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని శ్రీ ఉపాలయమైన నటరాజ స్వామి వారి ఆలయంలో తొలుత గణపతి పూజ చేశారు. అమ్మవారి ఆలయ స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకులు ఎల్‌డీ ప్రసాద్, వైదిక కమిటీ సభ్యులు రంగావజ్జుల శ్రీనివాసశాస్త్రి, కోట రవి, ఏఈవో దుర్గారావులతో పాటు ఆలయ అధికారులు స్వామి వారికి, అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో ఆలయ అర్చకులు, అధికారులు గణపతి పూజను నిర్వహించగా, ఉత్సవ మూర్తులకు మంగళస్నానాలు జరిపించారు. ఉత్సవ మూర్తులను వధూవరులుగా అలంకరించారు. సాయంత్రం 4 గంటలకు అంకురార్పణ, మంటపారాధన, అగ్నిప్రతిష్టాపన, ధ్వజారోహణ నిర్వహించి సర్వ దేవతలను స్వామి వారి కల్యాణోత్సవానికి ఆహ్వానించారు.

ఆదివారం సాయంత్రం 7 గంటలకు నటరాజ స్వామి వారి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ వైదిక కమిటీ పేర్కొంది. రాత్రి 10 గంటల నుంచి 11 గంటల వరకు శ్రీ నటరాజ స్వామి వారికి అభిషేకాలు, అన్నాభిషేకం నిర్వహిస్తామని, తెల్లవారుజామున 4 గంటలకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తామని పేర్కొంది.

## భవన నిర్మాణ కార్మికుల డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

పటమట(విజయవాడతూర్పు): భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు సీఐటీయూ నిరంతర పోరాటం చేస్తుందని ఎన్టీఆర్ జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. పటమటలంకలోని సంస్థ కార్యాలయంలో శనివారం కృష్ణా జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ విజయవాడ తూర్పు నగర విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ అసంఘటిత నిర్మాణ కార్మికులు, వివిధ రంగాల కార్మికుల పరిస్థితి ప్రమాదకరంగా ఉందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులని విస్మరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు దేశ వ్యాప్తంగా అమలులో ఉంటే మన రాష్ట్రంలో మాత్రం ప్రభుత్వ పెద్దలు సంక్షేమ బోర్డు నిర్వీర్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు పూర్తవుతున్న ఎన్నికల హామీలని అమలు చేయలేకపోతున్నాయని దుయ్యబట్టారు. 1214 సర్క్యులర్ ని రద్దు చేసి సంక్షేమ బోర్డుని వెంటనే పునః ప్రారంభించాలన్నారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పిల్లి నరసింహారావు, సీఐటీయూ నగర నాయకులు రాజు, కార్పెంటర్స్, పెయింటర్స్, మార్బుల్, తాపీ వర్కర్స్, ముఠా వర్కర్స్ కమిటీ సభ్యులు సనకా వేణుగోపాలకృష్ణ, పఠాన్ కరిముల్లా, మాజేటి మల్లేశ్వరరావు, ఇర్ఫాన్, కిరణ్, విజయ్ కుమార్, పొనమాల మల్లికార్జున పాల్గొన్నారు.

## బేకరీలు, స్వీట్ షాపుల కార్ఖానాలపై దాడులు



పటమట(విజయవాడతూర్పు): పండుగల సందర్భంగా వినియోగదారులు కొనుగోలు చేసే ఆహార పదార్థాలు కల్తీ జరుగుతున్నాయని వచ్చిన ఫిర్యాదు మేరకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.పూర్ణచంద్రరావు శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో మెరుపుదాడులు చేశారు. ఆయన మాట్లాడుతూ సెంటర్ ఫర్ ఫుడ్ సేఫ్టీ(సీఎఫ్ఎస్) ఆదేశాలతో ఫుడ్ ఆయా ఆహార తయారీ సంస్థలు నిబంధనలు పాటించేదీ లేనిదీ తనిఖీ చేశామని చెప్పారు. తమ దాడుల్లో ఆటోనగర్‌లోని సాయి హోటల్ బస్టాప్‌లో ఉన్న కొల్లి ఎంటర్‌ప్రైజెస్‌లో తయారయ్యే మోతీచోర్ లడ్డూలో, నగరంలోని రామరాజ్య నగర్‌లోని శ్రీ బాలాజీ ఫుడ్స్‌లో హార్లిక్స్ కలకండలో, బందరురోడ్డులోని స్వగృహ ఫుడ్స్ మోతీ చోర్‌లడ్డూలో, కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డులోని నవరంగ్ బేకరీలో లూజు కేకుల్లో, ఆటోనగర్‌లోని స్వాతి ప్రెస్ వద్ద ఉన్న కాజూ హౌస్‌లోని మయూర్ బ్రాండ్ జాంగ్రీ, డ్రైఅయిడ్ చెర్రీలో, ఆటోనగర్ 100 అడుగుల రోడ్డులోని సాయిబాబా ఘీ స్వీట్స్‌లో నకిలీ రంగులు, కల్తీ నూనెలు, సరుకులు, కల్తీ బెల్లం ఆహార పదార్థాల తయారీలో వినియోగిస్తున్నారని తమ తనిఖీల్లో బయటపడిందన్నారు. కార్ఖాన యాజమాన్యాలపై కేసులు నమోదు చేశామన్నారు.